మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 256
పేజీలు : 3

మంగళవారం -14 ఏప్రిల్, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## నోయిడాలో హింసాత్మకంగా మారిన కార్మికుల ఆందోళన

**టీ మీడియా, ఏప్రిల్ 13, న్యూఢిల్లీ:**



కనీస వేతనాల పెంపునుడిమాండ్ చేస్తూ కర్మాగార కార్మికులు చేపట్టిన నిరసనలు సోమవారం నోయిడాలోని కొన్ని ప్రాంతాల్లో హింసాత్మకంగా మారాయని పోలీసులు తెలిపారు. ఫేజ్-2, సెక్టార్ 60 ప్రాంతాల నుండి అగ్నిప్రమాదాలు, విధ్వంసం, రాళ్ల దాడికి సంబంధించిన ఘటనలు నమోదయ్యాయని పేర్కొన్నారు. అధికారుల ప్రకారం, వివిధ పారిశ్రామిక యూనిట్లకు చెందిన పెద్ద సంఖ్యలో కార్మికులు తమ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీతాల సవరణ డిమాండ్‌ను సాధించుకోవాలని కోరుతూ గుమిగూడి, ప్రదర్శన సందర్భంగా నినాదాలు చేశారు. అయితే, ఆ నిరసన హింసాత్మకంగా మారింది. ఈ దాడుల్లో నిరసన కారులు ఆస్తులను ధ్వంసం చేశారని, రాళ్లు విసిరారని, ఒక వాహనానికి నిప్పు పెట్టారని ఆరోపణలు వచ్చాయి. పరిశ్రమ ముందు పెద్ద సంఖ్యలో కార్మికులు గుమిగూడారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులపై బాష్ప వాయువును ప్రయోగించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసులు మోహరించారు.


# లోక్‌సభ సీట్ల పెంపు 50 % ప్రాతిపదికన జరగాలి

- ముఖ్యమంత్రిఎ. రేవంత్ రెడ్డి
- ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం

**టీ మీడియా, ఏప్రిల్ 13, హైదరాబాద్ బ్యూరో:**



దేశంలో నియోజకవర్గాల సీట్ల పెంపు, పునర్విభజన ప్రక్రియ జీఎస్‌డీపీ ఆధారిత హైబ్రీడ్ మోడల్‌లో జరగాలని ముఖ్యమంత్రిఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. "చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయడానికి సంపూర్ణ మద్దతునిస్తాం. కానీ లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పెంపునకు కేంద్రం ప్రకటించిన ప్రాతిపదిక దేశంలోని ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం పెంచడమే కాకుండా దేశానికి ప్రమాదకరంగా మారుతుంది.." అని హెచ్చరించారు. అందుకు ప్రతిగా ముఖ్యమంత్రి గారు జీఎస్డీపీ ఆధారిత హైబ్రీడ్ మోడల్‌ను ప్రతిపాదించారు. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల్లో పెంచాలనుకుంటున్న 50 శాతం అంటే 272 స్థానాల్లో 136 సీట్లను ప్రొరేటా ప్రకారం, మిగిలిన 136 సీట్లను జాతీయ స్థూల ఉత్పత్తి ప్రాతిపదికన విభజించి అత్యధిక శాతం అందిస్తున్న రాష్ట్రాలకు ప్రాధాన్యతనివ్వాలని ప్రతిపాదించారు. ఈ నెల 16 నుంచి నిర్వహించే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతో పాటు నియోజకవర్గాల పెంపు బిల్లును హడావిడిగా ఆమోదించాలని ప్రయత్నిస్తున్నారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల సంఖ్య పెంపు - పునర్విభజన రెండింటినీ ఒకటిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెండు వేర్వేరు అంశాలు. ఒకదానికి ఇంకొకటి సంబంధం లేదు. రెండూ వేటికవే చాలా ప్రాధాన్యత కలిగిన అంశాలు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని స్పష్టం చేశారు. కానీ ఎలాంటి ప్రాతిపదిక లేకుండా ఏకపక్షంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న సీట్లకు దామాషా ప్రకారం 50 శాతం లెక్కన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే దక్షిణాది రాష్ట్రాలు వివక్షకు గురవుతాయి. ఈ ప్రక్రియ వల్ల దేశంలో అనవసరమైన గందరగోళం ఏర్పడుతుంది. కొన్ని చిన్న రాష్ట్రాల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తీసుకున్న నిర్ణయానికి ఎలాంటి ప్రాతిపదిక తీసుకోలేదు. నియోజకవర్గాల పెంపుపై ముందుగా విధివిధానాలు ఖరారు చేయాలి. అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. అందరి అభిప్రాయాలు తీసుకోవాలి. రాష్ట్రాల శాసనసభల అభిప్రాయాలను తెలుసుకోవాలి. ఈ అంశంపై నిపుణుల కమిటీని నియమించాలి. నిపుణుల కమిటీ నివేదికపై పార్లమెంట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి" అని సూచించారు. నియోజకవర్గాల పెంపు -- పునర్విభజనకు సంబంధించి కేంద్రం తాజా నిర్ణయంపై ముఖ్యమంత్రి గారు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, వాకిటి శ్రీహరి గారు, ప్రభుత్వ సలహాదారు కేశవరావు గారు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాల పెంపు (డీలిమిటేషన్) ప్రక్రియ దేశ ప్రజలకు సంబంధించిన అంశం. దేశ భవిష్యత్తు ముడిపడి ఉన్న అంశం. ఈ విషయాల్లో కేంద్ర ప్రభుత్వ హడావిడి నిర్ణయం వల్ల ప్రజలకు నష్టం



జరుగుతుంది. మహిళలకు రిజర్వేషన్ల విషయంలో మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. నూటికి నూరు శాతం సంపూర్ణంగా మద్దతునిస్తున్నాం. 2023 లోనే ఈ బిల్లు ముందుకొచ్చినప్పుడు సంపూర్ణంగా మద్దతునిచ్చాం. 2026 లో చేపట్టే జనాభా లెక్కల తర్వాత అన్న చిన్న అడ్డంకిని అప్పుడే సవరించి, 33 శాతం రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఆ తర్వాత జరిగిన అనేక ఎన్నికల్లో ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో మహిళలకు అవకాశాలు దక్కి ఉండేవి. 2023 లో మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందినప్పుడు ఆ తర్వాత జరిగే జనాభా లెక్కల అనంతరం అమలులోకి వస్తుందని, ఇప్పుడు అలా కాకుండా ముందే చేయాలనుకుంటే అభ్యంతరం లేదు. కానీ అదేదో 2024 ఎన్నికల్లోనే అమలు చేసి ఉంటే 543 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం (181 మంది మహిళా ఎంపీలు) ఎంపిక కావడానికి అవకాశం ఉండె. ఆ తర్వాత పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. వాటిల్లోనూ మహిళా ప్రతినిధులు ఎంపికయ్యేవారు" అని ముఖ్యమంత్రి గారు విశ్లేషించారు .ఒకవైపు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. 2028 నాటికి ఈ ప్రక్రియ అంతా పూర్తవుతుంది. ప్రస్తుతం జరుగుతున్న జనాభా లెక్కలు ప్రక్రియను పక్కన పెట్టి, మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పెంపు రెండింటినీ కలిపి ఒక గాటన కట్టి తెరమీదకు తేవడం సరైంది కాదు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పునర్విభజన కూడా కలిపారు. ఈ పరిణామాలు దేశంలో రాజకీయ అసమానతలు, వివక్ష పెంచుతుంది. దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. జరుగుతున్న పరిణామాలపై దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు లేఖలు రాస్తాం" అని చెప్పారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్య నిర్ణయం అంగీకరించబోమని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తీర్మానించాం. దాంతో ఇంకో రూపంలో దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని ముందుకు తెచ్చారు. తాజా ప్రతిపాదనల మేరకు 20 స్థానాలున్న కేరళంలో 50 శాతం పెంచితే ఆ రాష్ట్ర స్థానాలు 60 కి చేరుతాయి. అదే ఉత్తరప్రదేశ్ 80 స్థానాలు 120 కి చేరుతాయి. రెండింటి మధ్య అంతరం 90 స్థానాలవుతాయి. 50 శాతం పెంచడం వల్ల తెలంగాణకు యూపీకి మధ్య ఇప్పుడున్న వ్యత్యాసంకన్నా ఎక్కువగా 94 సీట్ల అంతరం పెరుగుతుంది. 413 సీట్లున్న ఉత్తరాదిలో 50 శాతం సీట్లు పెంచడం వల్ల 621 కి పెరుగుతాయి. అంటే దక్షిణాదికి ఉత్తరాదికి మధ్య సీట్ల అంతరం 412 నుంచి 620 కి పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాలకు తీరని విఘాతం. చిన్న రాష్ట్రాలు రాజకీయంగా ద్వితీయశ్రేణి రాష్ట్రాలుగా మిగిలిపోతాయి ఈ పరిణామాలు దేశ మనుగడకు మంచిది కాదు. ఇది రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదు. దేశ ప్రజలకు సంబంధించిన అంశం. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక రాజధానులుగా, ఉత్తరాధి రాష్ట్రాలు రాజకీయ రాజధానులుగా మారకూడదు" అని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదాయం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. అలాంటప్పుడు మమ్మల్ని ఎలా శిక్షిస్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 50 శాతం రిజర్వేషన్లు మించకూడదు. 50 శాతం మెరిట్ ప్రాతిపదికన ఇస్తున్నాం. పన్నులు కట్టడం, సలామ్ చేయడమన్న విధానాలకు వ్యతిరేకం" అని స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరగలేదు. వంద శాతం జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు. ఆయా ప్రాంతాల ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారు" అని గుర్తుచేశారు. రాజకీయంగా నంబర్ లేనప్పుడు చిన్న రాష్ట్రాలతో మాట్లాడే వారే ఉండరు. బలహీనుడికి, బలవంతుడికి మధ్య ఒప్పందాలు జరగవు. ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోవలసి వస్తుంది. సీట్లు పెంచాలనుకుంటే ఏ ప్రాతిపదికన, ఎన్ని పెంచాలన్నది అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. గతంలో జనాబా లెక్కల ప్రకారం 543 స్థానాలు చేశారు.

దానిపై బ్లాంకెట్ గా 50 శాతం పెంచుతామని చెప్పడం సరికాదు. దీర్ఘకాలంలో సమస్యగా విపత్తుగా మారుతుంది" అని హెచ్చరించారు. హైబ్రీడ్ మాడల్‌లో 136 సీట్లు ప్రొరేటా ప్రకారం ఇవ్వండి. ఇంకో 50 శాతం సీట్లు దేశం స్థూల ఆర్థిక ఉత్పత్తి ప్రాతిపదికన ఇవ్వాలని ఒక ప్రతిపాదన చేస్తున్నాం. దానిపై చర్చించి నిర్ణయం తీసుకోండి. దేశ అభివృద్ధికి ఆర్థిక వనరులను సమకూర్చుతున్న అత్యధిక భాగస్వామ్యం కలిగిన రాష్ట్రాల ప్రాతిపదికన ఇవ్వాలని కోరుతున్నాం" అని చెప్పారు. "50 శాతం దామాషా ప్రకారం, మిగతా 50 శాతం జీఎస్డీపీ ప్రాతిపదికన ఇవ్వండి. ఏకాభిప్రాయానికి రండి. మొదట మహిళా రిజర్వేషన్లను ఆమోదించండి. నియోజకవర్గాలను పెంచడానికి నిపుణుల కమిటీని నియమించండి. నివేదికను సభల్లో చర్చకు పెట్టండి. రాష్ట్రాల అసెంబ్లీల అభిప్రాయాలను తెలుసుకోండి. జనగణన కోసం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నందున అవి పూర్తయ్యే లోగా అందరి అభిప్రాయాలు తీసుకుని నియోజకవర్గాల పెంపు, పునర్విభజన ప్రాతిపదికను నిర్ణయించండి. 2028 నాటికి ఈ ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది. అనవసరమైన గందరగోళానికి తెరలేపొద్దు" అని ముఖ్యమంత్రి గారు సవివరంగా చెప్పారు.

## భద్రత, పర్యావరణంపైల విషయంలో రాజీ పడొద్దు

- కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు భేటీ

**టీ మీడియా, ఏప్రిల్ 13, అమరావతి బ్యూరో :**



పరిశ్రమలు ఏర్పాటులో జాప్యం జరగ్గకుండా ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను మరింత సరళతరం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల తొలగింపునకు అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. పారిశ్రామిక ప్రగతికి మే నాటికి డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలు చేయాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలన్నారు. అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కేంద్రం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సీఎంతో సమావేశమయ్యారు. సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం పెంచడం అనుమతుల సులభతరం చేయడం అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్ర ప్రతిపాదనలను సీఎంకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వివరించారు. రాష్ట్ర విధానాలను, ప్రణాళికలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామన్నారు. ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు. పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలి: అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సీఎం సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని ఆ సంఖ్యను 57కు తగ్గించాలని సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. పారిశ్రామిక పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడిదారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ కనెక్షన్లను త్వరగా అందించాలని చెప్పారు. ఎంఎస్?ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. నిర్దిష్ట కాలానికి తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించే దిశగా పని చేయాలని సూచించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువస్తే దరఖాస్తుదారులకు చాలా వరకు పని భారం తగ్గుతుందన్నారు.

**డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా**

డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్రం ప్రతిపాదించిన అంశాల కన్నా మెరుగ్గా ఏపీ పని చేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబుతో అన్నారు. నిర్దిష్ట గడువులోగా ఏపీ ఫేజ్-2ను అమలు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని చెప్పారు. పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని సీఎం వెల్లడించారు. అటవీ చట్టాలను వీలైనంత సరళీకరించాలంటూ కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా అని ముఖ్యమంత్రి స్టీల్ సెక్రటరీని అడిగారు. జూన్ నెల నుంచి ఆ పని మీద ఉంటామని పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ, ఏఐ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను ఇప్పటికే తాము వినియోగిస్తున్నామని పౌండ్రిక్‌కు సీఎం వివరించారు.

## ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రానికి కొత్త రూపు

3లో..

## టీజీఎస్ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్




ఆర్టీసీ జేఏసీ ప్రకటన

- ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్

**టీ మీడియా, ఏప్రిల్ 13,హైదరాబాద్ బ్యూరో :**


తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళుతున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నల 13న సమ్మె నోటీసులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి :

3లో..

## భారత్ నౌకలకు టోల్ వసూల్ చేయడం లేదు

- మా సామర్థ్యం ఏంటో అమెరికాకు తెలుసు : ఇరాన్

**టీ మీడియా, ఏప్రిల్ 13,ఢిల్లీ బ్యూరో :**



అమెరికా- ఇరాన్ యుద్ధంపై భారత్?లోని టెహ్రాన్? రాయబారి మహమ్మద్ ఫతాలీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ డిమాండ్లను అంగీకరిస్తే అమెరికాతో మరోసారి చర్చలకు సిద్ధమేనని చెప్పారు. అలాగే హర్మూజ్ జలసంధి తమ దేశ ప్రాదేశిక జలాల్లో ఉందని తెలిపారు. భారత్?తో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, హర్ముజ్ నుంచి వెళ్లే ఆ దేశ నౌకల నుంచి ఎలాంటి టోల్ వసూలు చేయడం లేదని వెల్లడించారు. దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడతూ ఫతాలీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

**'శాంతికికే కాదు యుద్ధానికీ సిద్ధమే'**

తమ ఉన్నతాధికారులు, ప్రతినిధి బృందం శాంతికి సిద్ధంగా ఉందని ఇరాన్ రాయబారి ఫతాలీ తెలిపారు. చర్చలకు కూడా సిద్ధమే, కానీ ఇరాన్ యుద్ధానికీ రెడీగా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చల్లో అణు

మిగతా 3లో..



# అత్యుత్తమ ఫలితాలు సాధించిన సివి రామన్ విద్యార్థులు




- విద్యార్థులను అభినందించిన కళాశాల యజమాన్యం

**టీ మీడియా , ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
ఆదివారం ప్రకటించిన ఐపిఇ 2026 మొదటి, ద్వితీయ సంవత్సరము ఫలితాలలో సి.వి రామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ విజయ పరం వరను ఈ సంవత్సరము ఫలితాలలో కూడా కొనసాగించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలను సాధించడం సి.వి. రామన్ కే సాధ్యం. మా కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపు లలో మంచి ఫలితాలను ఫలితాలను సాధించటం జరిగిందని. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోలో మా విద్యార్థులు ఘనమైన ఫలితాలను సాధించినందుకు వారికి వారి తల్లితండ్రులకు, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందమునకు, శుభాభినందనలు తెలియజేసినకళాశాల యజమాన్యం. ఈ సందర్భంగా అద్భుతమైన ఫలితాలను సాధించినందుకు కళాశాల యాజమాన్యం విద్యార్థు లను, పూలబోకెలతో అభినందనలు తెలియజేశారు. సివి రామన్ విద్యార్థులు అన్ని గ్రూపులలో సాధించిన మార్కులు 900 పైగా మార్కులు 133 మంది విద్యార్థులు సాధించడంజిల్లా రికార్డు. (ఎంపిసి) 993, వి. మేఘన 992, కె. అక్షయ992, హన్సి 992, సానియా 992, ఎం.స్వాతి 991, ఇ. శ్రావణి 989, శ్రీహర్ష రెడ్డి 988, పిజి తనుశ్రీ 988, కె. కార్తీక్ 988, హెచ్. సాగర్ (బైపిసి) 991, సి. లక్ష్మీనారాయణ 986, పి. సూర్య వర్షిణి 979, ? 979, 2. 5 (2)983,వి. నందిని 967 సి. జ్ఞానేశ్వరి (సిఇసి) 884, ఆర్. వైష్ణవి 828, రామాంజనేయులు 400 పైగా మార్కులు 131 మంది విద్యార్థులు సాధించడం జిల్లా రికార్డు. (ఎంపిసి1) 468 కె.నవ్య సుధా, 468 ఏ. కావ్య, 467 మనస్విని, 467 జయ సూర్య, 467 నరసింహ,467 సుమన్, 466 శ్రావణి, 465 అక్షయ, (బైపిసి1) 433 మురళికృష్ణ, 427 అభిలాష్, 423 హారిక (ఎంఇసి1) 489 రాకేష్ నాయుడు, 475 గురు ప్రసాద్, (సిఈసి1) 479 కె. శివకుమార్, 475 కె. అనిల్, 466 బోజేష్ లు అత్యుత్తమ మార్కులు సాధించారు. విద్యార్థులకు కళాశాల యజమాని శాలువా పూల బొకేలతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డా. కె.వీరయ్య డైరెక్టర్స్ శ్రీ వెంకటేశ్వర్లు శ్రీ కుమారస్వామి. ప్రిన్సిపాల్ జి.యస్.యస్. ప్రకాశ్, సీనియర్ అధ్యాపకులు యస్. వెంకటరమణ, జమీర్ ఖాన్, మల్లిఖార్జున్, వెంకటేశ్వర్రెడ్డి, లింగస్వామి, శ్రీధర్, చంద్రశేఖర్, హనుమంత రావు, మనివర్ధన్, మహేందర్, రమేష్, శేఖర్ గౌడ్, మహేష్ లు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

**టీ మీడియా, ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని,అప్పటి వరకూ విద్యుత్ కార్మికులు పోరాడతారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టిఆర్పి) వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి. రవికుమార్ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జెయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయమైన పరిష్కారానికై టీజీఎస్పీడీసీఎల్ వనపర్తి డివిజన్ ఆఫీస్ ముందు నిరవధిక కార్మికులు చేపట్టిన సమ్మెను తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టిఆర్పి) వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి. రవికుమార్ పరిశీలించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు.జీవో 11ను వెంటనే అమలు చేసి, విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్లను ఉద్యోగులుగా మార్చాలని,అన్‌మ్యాన్డ్ వర్గాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2016కు ముందు పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 24 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు కొన్నేళ్లుగా సేవలందిస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు ఇప్పటికే వారి డిమాండ్లపై ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినా స్పందించకపోవడం బాధాకరమన్నారు.చాలీచాలని తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఇప్పటికైనా ప్రభుత్వం వారికి ప్రత్యేక పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కన్వర్షన్ ఇవ్వాలని , ఏపీఎస్ఈబీ రూల్స్ ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్‌లుగా విభజించారని, దీని వల్ల ఆర్టిజన్‌లు చాలా వరకు నష్టపోతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం,విద్యుత్ సంస్థల యాజమన్యాలు తక్షణమే స్పందించి, న్యాయమైన డిమాండ్ వారి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అశోకు, తిరుపతయ్య,నరేష్,జగదీష్, వనపర్తి జిల్లా చందు యాదవ్ తదితరులు కార్మికులు ఉన్నారు.



# అమరచింత మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**టి మీడియా, ఏప్రిల్ 13, అమరచింత :**
వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీలో రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేశారు. కో ఆప్షన్ సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ కి చెందిన తౌఫిక్ ,మణెమ్మ... సీపీఎం పార్టీ కి చెందిన చిన్నన్న,షాజహాన్ బీ లు ఎన్నికయ్యారు. మొత్తం అమరచింత మున్సిపాలిటీ లో 10 మంది కౌన్సిలర్ లు ఉన్నారు.పాలకవర్గం సమావేశం అయిన 60 రోజుల్లోపు కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా దానికనుగుణంగా అమరచింత మున్సిపల్ కమీషనర్ నూరుల్ నోటిఫికేషన్ జారీ చేశారు.అమరచింత మున్సిపాలిటీ కార్యాలయంలో మంత్రి రాకముందే సమావేశానికి ప్రారంభించాలని సమయపాలన పాటించడం లేదని మున్సిపల్ కమిషనర్ నూరుల్ అజిబ్ పై అగ్రహానికి దిగిన కౌన్సిలర్ మేర్వ రాజు ఛాంబర్ లో తన కుర్చీలో ఉన్న కమిషనర్ ను సమయం మించిపోతున్న కమిషనర్ మీటింగ్ కు రావాలని చేయి లాగిన బీజేపీ కౌన్సిలర్ మేర్వ రాజు. దీంతో కాసేపు కాంగ్రెస్ బిజెపి పార్టీ ల మధ్య ఉద్రిక్తత నెలకొంది. డి.ఎస్.పి జోక్యశీతో కౌన్సిలర్ ను పోలీస్ కస్టడి లోకి తీసుకున్న పోలీసులు. చివరికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తౌఫిక్, కమ్యూనిస్టు నాయకుడు అజయ్లను కో ఆప్షన్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.



# మండల్ కమిషన్ సిఫారస్సులను అమలు చేయాలి

- కుందేళ్ళ అర్జున్ యాదవ్

**టీ మీడియా, ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వనపర్తి నియోజకవర్గ కంటెస్టడ్ ఎమ్మెల్యే కుందేళ్ళ అర్జున్ యాదవ్, అతిథులుగా వట్టె జానయ్య యాదవ్, నాగసీతారాం యాదవ్, అంబర్ పేట్ శ్రీనివాస్ యాదవ్ జేఏసీ చైర్మన్ అజయ్ కుమార్ యాదవ్ అధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కుందేళ్ళ అర్జున్ యాదవ్ మాట్లాడుతూ బీపీ మండల్ గ దేశంలో వెనుకబడిన వర్గాలుకు రాజకీయ, విద్య రంగాలలో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసిన గొప్ప వ్యక్తి అని వారు తెలిపారు.బీపీ మండల్ ను 1978 లో మొర్రర్జీ దేశాయి వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ అమలు కోసం ఐదుగురు తో కూడిన కమిటీని వేశారు. ఆ కమిటీకి చైర్మన్ గా మండల్ ని నియమించడం జరిగింది అదే మండల్ కమిషన్ అని తెలిపారు.బీపీ మండల్ 1941 లోనే 23 సంవత్సరాలకి జిల్లా కౌన్సిల్ కి ఎన్నికైనారు అని, 1952 లోనే బీహార్ శాసన సభ కు ప్రజాప్రతినిధిగా ఎన్నికైరాని తెలిపారు.బీపీ మండల్ 1978 లో కమిషన్ చేపట్టిన రిజర్వేషన్ విధానం కి సంబందించిన రిపోర్ట్ 1980 డిసెంబర్ 1 న అంద జేశారు. అట్టి రిపోర్ట్ అప్పటి ప్రధాన మంతి ఇందిరా గాంధీ పరిశీలనలో ఉన్నపటికీ దానిని ఆమోదం తెలుపలేదు అని విశ్వ ప్రతాప్ సింగ్ ప్రధాని గా ఉన్న సమయంలో 1993 లో ఓబీసీ లకు విద్య, రాజకీయ రంగాలలో 27% రిజర్వేషన్ విధానం ను అమలు చేసారు అని, 1993 లో ఇంద్రాసహాని కేసులో సుప్రీం కోర్ట్ రిజర్వేషన్ ల పై తీర్పు ను ఇచ్చిందని తెలిపారు.మండల్ కమిషన్ సిపారస్సు లను కేంద్రం ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రెసిడెంట్,రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇతర నేతలు తదితరులు పాల్గొన్నారు.




# నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

## శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించిన రాయల, కాంగ్రెస్ నాయకులు

**టి మీడియా, ఏప్రిల్ 13, ముదిగొండ**
నేడు మండలంలోని వెంకటాపురం గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ. 1.40కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. శంకుస్థాపన కార్యక్రమ స్థలాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరావు సోమవారం పరిశీలించారు. కార్యక్రమ ఏర్పాట్లు గురించి కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ నాయకులు గుడిపూడి బుచ్చిరామయ్య, సర్పంచ్ కందుల బాలచ్చందర్, గ్రామ శాఖ అధ్యక్షులు గంట వెంకట్రావుకి పలు సూచనలు చేశారు. అంతకుముందు ఎస్సై మురళి, జోన్ ఇంచార్జి మల్లెల అజయ్ కూడా పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట కృష్ణ, నాయకులు కట్ల పుల్లయ్య, కట్ల కృష్ణ మోహన్, కట్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తీర్ణులైన విద్యార్థులకు సన్మానం

- అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు

**టీ మీడియా, ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
విద్యార్థులు బద్ధకం, ఫోన్, సినిమాలు, మత్తు వీడి చక్కగా చదువుతే మార్కులు వాటికంతట అవే వస్తాయి. తెలివి ఏ ఒక్కరి సొత్తు కాదు. మనం ఉపయోగించే ప్రవర్తన బట్టి మారుతుంది.మార్కులు ముఖ్యం కాదు జీవనం కొనసాగించండి బలవన్మరణాలు వద్దు. ఇంటర్ విద్యార్థుల సన్మానంలో విద్యార్థి లోకానికి అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా"సతీష్ యాదవ్ పిలుపు నిచ్చారు. వనపర్తి లోని జాగృతి జూనియర్ కాలేజ్, వాగ్దేవి జూనియర్ కాలేజ్ లలో రాష్ట్రస్థాయి అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థిని, విద్యార్థులకు ఐక్యవేదిక సన్మానం సందర్భంగా అధ్యక్షుడు డా"సతీష్ యాదవ్ మాట్లాడుతూ కొందరు విద్యార్థులు విద్యార్థినీలు రెండు సంవత్సరాలు చదవకుండా ఆఖరిలో పరీక్ష ఒత్తిడితో ఆత్మహత్యలు చేసుకోవడం బాధిస్తుందని, 17 - 18 సంవత్సరాలుగా తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తే మార్కులు రావని ఒత్తిడితో ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు ధైర్యం చెబుతూ తెలివి ఏ ఒక్కరి సొత్తు కాదని మీరు ఫోన్లు పక్కన పెట్టండి, సినిమాల మత్తు వదలండి. మిగతా మత్తులను పక్కన పెడితే మీరందరూ ఉత్తీర్ణులు అవుతారని, మీకు కూడా ఇలాంటి మార్కులు వస్తాయని, జాగృతి కాలేజీలో రాష్ట్రస్థాయి మార్కులు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు, వాగ్దేవి కాలేజీలో రాష్ట్రస్థాయిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సన్మానం చేస్తూ చెప్పడం జరిగింది. అలాగే రేపు గవర్నమెంట్ కాలేజీల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సన్మానం చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా సతీష్ యాదవ్ తెలిపారు. ఈ సన్మానం చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్ , శ్రీనివాసులు, రామస్వామి, మైబూస్ కళాశాలల యజమాన్యం పాల్గొన్నారు.



# మెరిట్ విద్యార్థులను సన్మానించిన మాజీ మంత్రి

**టీ మీడియా, ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
ఇంటర్మీడియట్ ఫలితాలలో మొదటి ర్యాంక్ సాధించడం వనపర్తికి గర్వకారణం.మొదటి ర్యాంకర్ హసిత శ్రీకి, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపిన నిరంజన్ రెడ్డి .పట్టణానికి చెందిన రావుస్ కళాశాల విద్యార్థిని ఎం. హసిత శ్రీ ఇంటర్మీడియట్ ఎం.పి.సి లో 996మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి స్వగృహంలో హసిత శ్రీ విద్యార్థిని సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ హసిత శ్రీ మొదటి నుండి ప్రతిభ గలదని ఈరోజు రాష్టములోనే 996మార్కులతో మొదటి ర్యాంక్ సాధించడం వనపర్తికి గర్వకారణం అని కొనియాడారు.విద్యార్థి, విద్యార్థినిలు చదువును ఇష్టపడి చదువుకోవాలని అదేవిధంగా చదువుతో పాటు పరిసరాలు,సమాజాన్ని అధ్యయనం చేసుకొని తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు.విద్యార్థిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు కుసుమా సాయిలను అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. మెరిట్ విద్యార్థులను సన్మానించారు.రావుస్ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలు ప్రణయ తేజ, రిషిత, భవిష్య,శిల్పారెడ్డి,నందిని,తేజశ్రీ, అప్సరా అక్షయాలను సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో వాకిటి.శ్రీధర్,నందిమల్ల.అశోక్,ప్రేమ్నాథ్రెడ్డి,అడ్వకేట్.బాలయ్య,చిట్యాల.రాము, అలీమ్ క్రాంతి, మరియు శ్రీను, గోకారం.రాజు,వైల్. వెంకటేష్, అధ్యాపక బృందం ప్రిన్సిపాల్,రామ్ కుమార్,ఏ.శ్రీనివాస్,కె. శ్రీనివాస్, అమరేందర్, రమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.






# రాష్ట్రస్థాయిలో మెరిసిన ఆణిముత్యాలు

- ర్యాంకులు సాధించిన స్కాలర్స్ విద్యార్థులు

**వనపర్తి, ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం ప్రకటించిన ఐపిఇ 2026 ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో గతంలో మాదిరిగా ఎంపిసి, బైపిసి గ్రూపులలో విజయ దుందుభి మ్రోగించిన స్కాలర్స్ విద్యార్థులు. ద్వితీయ సంవత్సరం బైపిసి లో బి. మహాలక్ష్మి 993, అలీషాసాజి 992, సుస్మిత 991, బాంధవి 990 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపిఇ లో కె. నర్మద 992, కె. శిరీష 991, కె. లలిత 989 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బైపిసి లో టి.శ్రావణి 771 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపిసిలో డి. పల్లవి 437, నిమ్ర అఫ్సిన్ 437, బి. అక్షయలక్ష్మి 436, భవ్యశ్రీ 434, కెయామిని 434, సాత్విక 434, కె. రాజేష్ 434, కె. ఇందు 432, అఖిలాండేశ్వరి 432, గేయశ్రీ 432, అఖిల 432 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ఏ.బన్ని 463, జి. హర్షిత 462, శ్రీవర్షిని 462, దివ్యశ్రీ 460 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం సిఇసి లో ముస్కన్ 406 మార్కులు సాధించారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వీరిని ప్రోత్సహించిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని, విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపాల్స్ ఎ.శ్రీధర్, బి.మధుసూదన్ గుప్త, డైరెక్టర్లు డా.పి. జగదీశ్వర్, డా.జి. వరప్రసాదరావు,డా. బి.నాగేశ్వర్రెడ్డి, డా.ఎల్. సత్యనారాయణరెడ్డి లను శాలువా, పూల బొకేలతో అభినందించారు.

# నిర్మాణ రంగ అభివృద్ధి లక్ష్యంగా బిల్డర్స్ నూతన ఎన్నిక

**టీ మీడియా, ఏప్రిల్ 13, రామకృష్ణాపూర్:**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని బిల్డర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భీమా మల్లేష్, అధ్యక్షుడిగా పనాస రాజు,జనరల్ సెక్రటరీగా అక్కల రమేష్, కోశాధికారిగా నల్లగోని కుమార్ గౌడ్,ముఖ్య సలహాదారుగా పెద్దూరి రాములు ఎన్నికయ్యారు. అనంతరం ఉపాధ్యక్షులుగా సురేందర్ గౌడ్,గుర్రం తిరుపతి, సెక్రటరీలుగా ఆడెపు విజయ్, సిరిమల్ల సుధాకర్,గట్టు నవీన్ కుమార్,బత్తుల శ్రీనివాస్ ఎంపికయ్యారు.అదేవిధంగా గౌరవ కార్యవర్గ సభ్యులుగా సకనవీటి శ్రీనివాస్,ముత్తె బానయ్య,ఆవుల జైపాల్ రెడ్డి,చిందం చంద్రకాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతం,నిర్మాణ రంగ అభివృద్ధి లక్ష్యంగా కార్యకలాపాలను విస్తరించి,బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.



# ప్రాథమికోన్నత పాఠశాలలో ఏక్ భరత్ శ్రేష్ట్ భారత్

**టీ మీడియా, ఏప్రిల్ 13, పెబ్బేరు :**
సోమవారం పెబ్బేరు మండలం లోని బునియాదిపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా ఏక్ భరత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తెలంగాణ హర్యానా రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు ఇరు రాష్ట్రాలకు సంబంధించిన వంటకాలు కార్యక్రమంలో ప్రదర్శించారు తెలంగాణ హర్యానా రాష్ట్రాల ఉమ్మడి సాంస్కృతిక పాటలు నృత్యాలతో విద్యార్థులు అలరించారు జాతీయ సమైక్యత పెంపునకు ఉద్దేశించిన కార్యక్రమం ఏక్ భరత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమం ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు నాగశేషు మాట్లాడుతూ 2015, అక్టోబర్ 31న దేశ ప్రధాన మంత్రి వివిధ రాష్ట్రాల సాంస్కృతిక, ఆహార వైవిధ్యాలను గౌరవిస్తూ భిన్నత్వంలో ఏకత్వం పెంపొందించడానికి ప్రారంభించారని పేర్కొన్నారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దయానంద్ కీర్తి రంజిత అనురాధ విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.




# కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**టీ మీడియా, ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)లో చదివి ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను సోమవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులకు చాక్లెట్లు అందజేసి వారి ప్రతిభను ప్రశంసించారు. కష్టపడి చదివి భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి సూచించారు. విద్యార్థినులు సాధించిన విజయాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# ఇంటర్ ఫలితాలు 2026 మిగిల్చిన విషాదం..

- ఒక్కరోజులోనే ఏడుగురు విద్యార్థుల ఆత్మహత్య!

**టీ మీడియా, ఏప్రిల్ 13,హైదరాబాద్:**
తెలంగాణలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. అయితే ఇంటర్ ఫలితాలు పలు కుటుంబాల్లో తీరని ఆవేదన మిగిల్చాయి. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనే మనస్తాపంతో రాష్ట్రవ్యాప్తంగా వేరేవేరు చోట్ల ఆరుగురు విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు తీసుకున్నారు. మెదక్, సూర్యాపేట, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఈ దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయి.ఏప్రిల్ 12న ఉదయం ఫలితాలు వెలువడిన తర్వాత తమ మార్కులు చూసుకున్న పలువురు విద్యార్థులు ఇంటర్ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు తెలుసుకుని తీవ్ర మనస్తాపం చెందారు. అనంతరం వరుస ఆత్మహత్యకు పాల్పడ్డారు. మెదక్ జిల్లాకు చెందిన చాకలి సాయిరాం (16) రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జూలపల్లి సౌజన్య (17) 2 సబ్జెక్టుల్లో, మహబూబ్‌నగర్‌కు చెందిన జక్కుల శ్రావణి 2 సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో.. వీరంతా ఇళ్లలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇక సూర్యాపేట జిల్లాకు చెందిన యడ్ల సౌజన్య (16) జువాలజీ సబ్జెక్టులో ఫెయిల్ అయింది. ఇంట్లోని బాత్రూంలో ఉరేసుకుని తనువు చాలించింది. హైదరాబాద్ వారాసిగూడకు చెందిన మరో విద్యార్థి కోయడ కల్యాణి బేగం (16) నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయింది. 'గుడ్ బై.. నా ఇంటర్ రిజల్ట్ చూడొద్దు' అని సోదరుడికి ఫోన్‌లో మెసేజ్ పంపి ఆత్మహత్య చేసుకుంది.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్ నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి అభి యాదవ్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అభి యాదవ్ రెండు సబ్జెక్టులలో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లాకు చెందిన గంగదేవుల అక్షంత్ (17) అనే విద్యార్థి ఫలితాలకు ముందే ఫెయిల్ అవుతాననే భయంతో రెండు రోజుల క్రితం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ ఆదివారం విడుదలైన ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లో కలిపి ఏకంగా 347 మార్కులతో ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు. కుమారుడి మార్కులు చూసిన మృతుడి తల్లిదండ్రులు కన్నీరు. మున్నీరుగా విలపించారు.



# టీఎస్ యుటిఎఫ్ ఆశయాలు పండాలి

**టీ మీడియా, ఏప్రిల్ 13, వనపర్తి బ్యూరో :**
టీఎస్ యుటిఎఫ్ ఆశయాలు పండాలని, ఆకాంక్షలునెరవేరాలని పలువురు ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవం అనంతరం సంఘం ఏర్పడి13 వసంతాల సందర్భంగా సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు సోమవారం జిల్లా కార్యాలయం దగ్గర సంఘం జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రవిప్రసాద్ గౌడ్, డి.కృష్ణయ్య మాట్లాడుతు అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో, హక్కులు బాధ్యతలు రెండు నేత్రాలుగా భావిస్తూ సంఘం పనిచేస్తుందన్నారు. సంఘం ఆశయాలు ఆకాంక్షల నెరవేర్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఉ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కే. జ్యోతి, బి.వెంకటేష్, కోశాధికారి తిమ్మప్ప, కార్యదర్శులు పి. శ్రీనివాస్ గౌడ్, ఆర్.రామన్ గౌడు,ఎ.వెంకటేశ్వర్లు, అయోధ్య రాములు, నాయకులు డి.రాము, రాజు, రాజేష్ బాబు,వెంకటేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రానికి కొత్త రూపు

- ఏటా గ్రిడ్‌కు సుమారు 3500 మిలియన్ యూనిట్ల విద్యుత్

**టీ మీడియా, ఏప్రిల్ 13, అమరావతి బ్యూరో :**

రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో ఒక విశేషమైన అధ్యాయం ఆవిష్కృతం కాబోతోంది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన 'అప్పర్ సీలేరు జల విద్యుత్ కేంద్రం' ఇప్పుడు ఆధునిక సాంకేతికత సాయంతో మార్పులకు సిద్ధమవుతోంది. కేవలం జల విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని విద్యుత్ మిగులు ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, ఇది ఒక భారీ 'పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు'గా రూపుదిద్దుకుంటోంది.

**ఆరు దశాబ్దాల క్రితం స్విట్జర్లాండ్ సాంకేతికతతో మొదలు**

ఎగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టు ఆరు దశాబ్దాల తర్వాత కొత్త రూపు సంతరించుకోనుంది. ఇప్పటి వరకు జల విద్యుత్ ప్రాజెక్టుగా ఉన్న ప్రాంతం భారీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు(పీఎస్‌పీ)గా రూపాంతరం చెందనుంది. ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9 వర్టికల్ ఫ్రాన్సిస్ రివర్స్‌బుల్ పంప్ టర్బైన్‌లు అండ్ సింక్రనైజ్డ్ మోటార్ జనరేటర్ సెట్‌లు ఏర్పాటు కానున్నాయి. 1,350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో కొత్త ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. పీఎస్‌పీ ప్రాజెక్టు కోసం కేవలం పంప్‌హౌస్‌ను మాత్రమే ప్రస్తుతం నిర్మించనున్నారు. 2029 నాటికి పీఎస్‌పీ ప్రాజెక్టు పూర్తి : ఎగువ రిజర్వాయర్ గుంటవాడగా, దిగువ రిజర్వాయర్ డొంకరాయినిగా వినియోగిస్తారు. పగటి వేళల్లో పునరుత్పాదక విద్యుత్ అదనంగా ఉన్నప్పుడు ఎగువ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసి పీక్ డిమాండ్ వేళల్లో ఆ నీటితో విద్యుత్ ఉత్పత్తి చేసి దిగువ రిజర్వాయర్‌కు పంపేలా ప్రాజెక్టును రూపొందించారు. విద్యుత్ ఉత్పత్తి కోసం సుమారు 1.70 టీఎంసీల నీరు అవసరమవుతుంది. 2029 నాటికి పీఎస్‌పీ ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది లక్ష్యం. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో దీన్ని నిర్మిస్తున్నారు. దీని ద్వారా ఏటా సుమారు 3,500 మిలియన్ యూనిట్ల విద్యుత్ గ్రిడ్‌కు అందుతుందని అంచనా.



**సగటు వార్షిక వర్షపాతం 1,388 మిల్లీ మీటర్లు**

ఈ ప్రాంతంలో సగటు వార్షిక వర్షపాతం 1,388 మిల్లీ మీటర్లు ఉండటం వల్ల నిరంతర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి ప్రవాహం అందుబాటులో ఉంటుంది. గుంటవాడ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 3.66 టీఎంసీలుగా ఉంది. కొత్తగా నిర్మిస్తున్న పీఎస్‌పీ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 1.7 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించనున్నారు. మిగిలిన నీరు రిజర్వాయర్‌లోనే ఉంటుంది. అది పోను రిజర్వాయర్‌లో ఉన్న నీటి ద్వారా ఎగువ సీలేరులో ప్రస్తుతం ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా యథావిధిగా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

**240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి**

ఇక్కడ ఒక్కొక్కటి 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇక్కడ హెడ్ (నీటి ఎత్తు) సుమారు 92.58 మీటర్లుగా ఉంది. ఎక్కువ హెడ్ ఉండటం వల్ల మీడియం హెడ్ జల విద్యుత్ కేంద్రాలకు అనువైన వర్టికల్ ఫ్రాన్సిస్ టర్బైన్ జనరేటర్లను వినియోగించారు. వాటిలో పంప్ సైజు తక్కువగా ఉన్నప్పటికీ హెడ్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడింది. పాత కాలపు పటిష్టతకు భవిష్యత్తు సాంకేతికతకు ఒక అద్భుత సాక్ష్యంగా ఎగువ సీలేరు నిలవనుంది.

**రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో నేటికీ కీలకం**

ప్రస్తుతం ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు 575 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ ఉత్పత్తి అందుతోంది. తొలిదశలో ఏర్పాటు చేసిన రెండు యూనిట్లు 1967-68లో ఏర్పాటయ్యాయి. వాటికి అవసరమైన టర్బైన్లను స్విట్జర్లాండ్‌కు చెందిన ఎక్స్‌చర్‌వైస్ అండ్ చార్మిల్స్ సంస్థ సరఫరా చేసింది. జనరేటర్లను ఓర్లికాన్ అందించింది. 1994-95లో మరో రెండు యూనిట్లు ఏర్పాటు చేశారు. వాటిని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది.

**స్వదేశీ 'భెల్' సహకారంతో పంప్డ్ స్టోరేజ్ టెక్నాలజీ**

ఈ ప్లాంట్ల సాధారణ కాలపరిమితి 35 ఏళ్లు అయినప్పటికి క్రమబద్ధమైన ఆధునికీకరణ, నిర్వహణ పనులతో ఇప్పటికీ సమర్థంగా పనిచేస్తోంది. సుమారు ఆరు దశాబ్దాల కిందట ప్రారంభమైనప్పటికీ నేటికీ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. బలిమెల రిజర్వాయర్‌కు దిగువన గుంటవాడ వద్ద నిర్మించిన వియర్ ద్వారా సీలేరు నది నీటిని ప్రాజెక్టు కోసం వినియోగిస్తున్నారు. మొత్తానికి, ఎగువ సీలేరు ప్రాజెక్టు ఆధునికీకరణ రాష్ట్ర విద్యుత్ రంగంలో ఒక నవశకానికి నాంది పలకనుంది. ఆరు దశాబ్దాల క్రితం స్విట్జర్లాండ్ సాంకేతికతతో మొదలై, నేడు స్వదేశీ 'భెల్' సహకారంతో ప్రపంచ స్థాయి పంప్డ్ స్టోరేజ్ టెక్నాలజీ వైపు అడుగులు వేయడం హర్షణీయం. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదు పాత కాలపు పటిష్టతకు, రేపటి తరం సాంకేతికతకు ఒక అద్భుత మేళవింపుగా నిలవనుంది.




## హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

- ఎల్‌పీజీతో భారత్‌కు 'జగ్ విక్రమ్' : కేంద్రం

**టీ మీడియా, ఏప్రిల్ 13,ఢిల్లీ బ్యూరో :**

జగ్ విక్రమ్ అనే భారత నౌక 20,400 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ఏప్రిల్ 14కల్లా గుజరాత్‌లోని కాండ్లాకు చేరుకుంటుందని పోర్టులు, నౌకాయానం, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ వెల్లడించారు. 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని ఆయన తెలిపారు. అమెరికా – ఇరాన్ మధ్య 14 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత హర్మూజ్ మీదుగా వస్తున్న తొలి భారత నౌక ఇదేనన్నారు. గత 24 గంటల వ్యవధిలో గల్ఫ్ సముద్ర జలాల్లో భారత జెండా కలిగిన నౌకలు, భారతీయ నావికులపై ఒక్క దాడి కూడా జరగలేదని ముకేశ్ మంగళ్ చెప్పారు. సోమవారం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా – ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 2,177 మంది భారతీయ నావికుల సురక్షిత ప్రయాణానికి తమ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. గల్ఫ్‌లో గత 24 గంటల్లోనే 93 మంది భారతీయ నావికుల కోసం సురక్షిత ప్రయాణ ఏర్పాట్లు చేశామని ముకేశ్ పేర్కొన్నారు.

**ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు**

"నావికుల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నాం. ఇందుకోసం నిరంతరాయంగా సముద్రజలాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. భారత విదేశాంగ శాఖ, గల్ఫ్ పరిధిలోని భారతీయ మిషన్లు, సముద్ర జల రవాణాతో ముడిపడిన విభాగాలు, సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నాం. గల్ఫ్‌లో చిక్కుకున్న అన్ని భారతీయ నౌకలను తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనంత త్వరగా వాటిని హర్మూజ్ దాటించి భారత్‌కు తీసుకొస్తాం. ప్రస్తుతానికి భారత్‌కు చెందిన 15 నౌకలు గల్ఫ్ సముద్ర జలాల్లో ఉన్నాయి" అని కేంద్ర నౌకాయాన శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ తెలిపారు.

**నిరంతరాయంగా ఎల్‌పీజీ సప్లై- బాధ్యతాయుతంగా వినియోగించాలని పిలుపు**

భారత్‌లో తగినంత ఎల్‌పీజీ స్టాక్ ఉందని, సిలిండర్ల పంపిణీ నిలకడగా జరుగుతోందని కేంద్ర పెట్రోలియం – సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. దేశ ప్రజలంతా బాధ్యతాయుతంగా ఎల్‌పీజీని వినియోగించాలని, భయాందోళనతో గ్యాస్ బుకింగ్స్ చేయొద్దని సూచించారు. ఇకపైనా ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ నిరాటంకంగా జరుగుతుందని ఆమె భరోసా ఇచ్చారు. ఎల్‌పీజీ నిల్వలపై భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తోందని, దేశవ్యాప్తంగా ప్రజలకు సిలిండర్ల సప్లైలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తోందని సుజాత శర్మ చెప్పారు. దేశంలోని ఎల్‌పీజీ కస్టమర్లలో దాదాపు 99 శాతం మంది ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్, వాట్సాప్, మొబైల్ అప్లికేషన్ల వంటి డిజిటల్ వేదికల ద్వారా సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలకు జనం రద్దీ తగ్గుతుందని, వేగవంతంగా సిలిండర్ల డెలివరీకి అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

**ఎలక్ట్రిక్ వాహనాలపై రాయితీల పొడిగింపు**

ఎలక్ట్రిక్ వాహనాలపై అందిస్తున్న రాయితీలను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఎలక్ట్రిక్ త్రీ వీలర్లపై అందించే సబ్సిడీకి సంబంధించిన టర్మినల్ తేదీని 2028 మార్చి వరకు పొడిగించామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. ఇక టూవీలర్లపై రాయితీ పొడిగింపు 2026 జులై వరకు అమల్లో ఉంటుందన్నారు.

**ప్రధాని ఆదేశాల మేరకు గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్ బలోపేతం**

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు తాము గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్‌ను బలోపేతం చేస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఇందులో భాగంగానే భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఏప్రిల్ 11, 12 తేదీల్లో యూఏఈలో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పెద్దలను కలిశారని ఆయన తెలిపారు. పశ్చిమాసియా సైనిక ఘర్షణ వేళ భారతీయులకు భద్రత కల్పించినందుకు యూఏఈ పాలకులకు భారత విదేశాంగ మంత్రి ధన్యవాదాలు చెప్పారన్నారు.

## భారత్ నౌకలకు టోల్ వసూల్ చేయడం లేదు

(మొదటిపేజీ తరువాయి..)

కార్యక్రమం, ఆంక్షల ఎత్తివేత, యుద్ధ పరిహారం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అయితే అమెరికా చేసిన చట్టవిరుద్ధమైన డిమాండ్ల వల్లే ఒప్పందం కుదరలేదు.

**'ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే హర్మూజ్'**




ఇదే క్రమంలో హర్మూజ్ అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ రాయబారి స్పందించారు. ఇరాన్ సామర్థ్యాల గురించి అమెరికాకు బాగా తెలుసని అన్నారు. యుద్ధానికి ముందు ఈ మార్గం తెరిచి ఉందని, కానీ దాడుల తర్వాత పరిస్థితులు మారాయని చెప్పారు. హర్మూజ్ జలసంధిపై అమెరికా దిగ్బంధిస్తే అది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అవుతుందని హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే ఉందని, ఆ జలాలను కాపాడుకోవడానికి తమకున్న హక్కులను వినియోగించుకుంటామని తెలిపారు. స్నేహపూర్వక దేశాలకు, ముఖ్యంగా భారత్‌కు హర్మూజ్? మార్గాన్ని తెరిచి ఉంచుతామని వివరించారు.

**భారత్ విశ్వసనీయ భాగస్వామి : ఫతాలీ**

కష్టకాలంలో భారత్ ప్రభుత్వం, ప్రజలు చూపిన మద్దతుకు ఫతాలీ కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రజలు నిజంగా విశ్వసనీయులు, సహానుభూతి గలవారని అన్నారు. భారత్ ప్రభుత్వంతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ దేశ నౌకలకు సురక్షిత ప్రయాణం కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి భారత్‌ను అత్యంత సన్నిహిత మిత్ర దేశాలలో ఒకటిగా పేర్కొన్నారని తెలిపారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా భారత్?కు చెందిన ఎల్?పీజీ నౌక జాగ్? విక్రం విజయవంతంగా హర్మూజ్ జలసంధి దాటింది. ఈ నౌకతో పాటు ఇప్పటికే మరో ఎనిమిది భారత నౌకలు కూడా సురక్షితంగా ఈ మార్గం దాటినట్లు సమాచారం.

**ఒప్పందాలను ఉల్లంఘించిన అమెరికా- ఇజ్రాయెల్**

అమెరికా, ఇజ్రాయెల్ ఒప్పందాలను ఉల్లంఘించాయని ఫతాలీ ఆరోపించారు. చర్చలు జరుగుతున్న సమయంలోనే దాడులు జరిగాయని, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. అన్ని తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. తమ దేశంపై అమెరికా–ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా చేసిన దాడుల్లో 3375 మంది పౌరులు మృతి చెందినట్లు తెలిపారు. ప్రాణ నష్టంతో పాటు గణనీయమైన ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఇరాన్‌పై వివిధ రకాల ఆంక్షలు విధించారని, అయినప్పటికీ దేశం స్వావలంబన దిశగా ముందుకు సాగిందని చెప్పారు. సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ సూచనలతో దేశీయ ఉత్పత్తిపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా హర్మూజ్ జలసంధిని నౌకాదళంతో నిరోధించే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో, పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది. మళ్లీ ఇరుపక్షాలు మధ్య ప్రత్యక్ష చర్చలు ఎప్పుడూ జరుగుతాయో కూడా స్పష్టత లేదు. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో అని ఆందోళన నెలకొంది.

## గాయని మంగ్లీ వివాదంలో మరో మలుపు

- ఇరువర్గాలూ ఆధారాలు ఇవ్వలేదంటున్న పోలీసులు

**టీ మీడియా, ఏప్రిల్ 13, హైదరాబాద్ బ్యూరో:**

ప్రముఖ గాయని మంగ్లీ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి బాధితుల తరపున పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన న్యాయవాది సుబ్బారావుకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. బాధితులతో కలిసి వచ్చిన న్యాయవాది సుబ్బారావు మద్యం సేవించి ఉన్నారనే అనుమానంతో పోలీసులు ఆయనకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో 27 పాయింట్లు నమోదయ్యాయి. మంగ్లీ, న్యాయవాది సుబ్బారావు మధ్య జరిగిన గొడవకు సంబంధించి, ఇరువర్గాలు ఒకరినొకరు బెదిరించుకున్నారనే ఫిర్యాదుపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులు అందినప్పటికీ, దానికి సంబంధించిన పక్కా ఆధారాలను ఇరువర్గాలు ఇప్పటి వరకు పోలీసులకు సమర్పించలేదు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోందని సీఐ రామకృష్ణ తెలిపారు.

**అసలేంజరిగిందంటే**

మైక్రో ఫైనాన్స్? పథకాలలో పెట్టుబడులు పెట్టిస్తామని నమ్మించి రమావత్? మధుపాల్? అలియాస్? భరత్? చౌహాన్?, శివ (మంగ్లీ సోదరుడు), శైలజా చౌహాన్?, మంగ్లీ కలిసి దాదాపు రూ. 9.5 నుంచి రూ. 10 కోట్ల వరకు సేకరించినట్లు న్యాయవాది సుబ్బారావు ఆరోపించారు. ఈ నిధులను గోకులానందన ఇన్?ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్? పేరిట ఇంపోర్ట్ – ఎక్స్?పోర్ట్?, ట్రేడింగ్, రియల్? ఎస్?టేట్?లలో పెట్టుబడులు పెడతామని బాధితులను నమ్మించారని ఫిర్యాదు చేశారు.



**మంగ్లీ డబ్బు ఆఫర్ చేసినట్లు ఆరోపణలు**

ఈ మేరకు బాధితులు తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన న్యాయవాది సింగపోగు సుబ్బారావును సంప్రదించారు. దీనిపై సింగర్? మంగ్లీని సంప్రదించగా ఆమె అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో తెలిపారు. అంతేకాదు ఈ కేసులో ఆమెను, తన సోదరుడు శివను చేర్చవద్దని మంగ్లీ ఆ న్యాయవాదికి డబ్బు ఆఫర్? చేసినట్లు ఆరోపించారు. ఆ తర్వాత దర్శకుడు వేణు ఊడుగుల, అడ్వకేట్? పూజారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంజాగుట్టలో సమావేశం ఏర్పాటు చేశారు.

**న్యాయవాది సుబ్బారావుకు ప్రాణహాని :**

మంగ్లీ, వేణు, పూజారి నాగేశ్వర రావు, సంగీత దర్శకుడు సురేశ్? బొబ్బిలి తదితరులు కేసు వేయవద్దని, మీడియా వీడియోలు తొలగించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమావేశం ముగిసే సమయంలో వేణు ఊడుగుల బెదిరించగా, మంగ్లీ అసభ్య పదజాలంతో దూషించి హత్య చేస్తామని బెదిరించినట్లు సుబ్బారావు ఆరోపించారు. అదే విధంగా రమావత్? మధు, శివ ఫోన్? చేసి బెదిరించినట్లు తెలిపారు. దీంతో తనకు ప్రాణహాని ఉందని సుబ్బారావు పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేశారు.

**మద్యం సేవించి పోలీస్ స్టేషన్‌కు**

ఈ కేసుకు సంబంధించి బాధితుల తరపున పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు న్యాయవాది సుబ్బారావు వచ్చారు. అయితే ఆయనకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. బాధితులతో కలిసి వచ్చిన సుబ్బారావు మద్యం సేవించి ఉన్నారనే అనుమానం వచ్చింది. దీంతో పోలీసులు ఆయనకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 27 పాయింట్లు నమోదయ్యిందని పోలీసులు తెలిపారు. మంగ్లీ, న్యాయవాది సుబ్బారావు మధ్య జరిగిన గొడవకు సంబంధించి, ఇరువర్గాలు ఒకరినొకరు బెదిరించుకున్నారనే ఫిర్యాదుపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులు అందినప్పటికీ, దానికి సంబంధించిన పక్కా ఆధారాలను ఇరువర్గాలు ఇప్పటి వరకు పోలీసులకు సమర్పించలేదు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోందని సీఐ రామకృష్ణ తెలిపారు.

## టీజీఎస్ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

(మొదటిపేజీ తరువాయి..)

సమ్మె నివారణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. తెలంగాణ ప్రభుత్వం, యాజమాన్యం ముందు 32 డిమాండ్లు పెట్టామని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ వైస్‌ఛైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని అన్నారు.ఆర్టీసీ క్రాస్ రోడ్?లోని కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ డిపార్ట్?మెంట్ అధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు ఈ నెల 9న సమావేశమయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించి తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కార్మిక శాఖకు, తమ యాజమాన్యానికి సమ్మెనోటీస్ ఇచ్చామని తెలిపారు.

**నిర్వీర్యం చేయొద్దు**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి గత రెండేన్నరేళ్లుగా ఆర్టీసీ కార్మికులకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురి వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఆర్టీసీని విస్తరించడం మంచిదే అయినప్పటికీ అదే పేరుతో దానిని నిర్వీర్యం చేయొద్దని తెలిపారు. ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల వల్ల గుత్తేదారుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని అందువల్ల వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు.

**పోరాటం ఆగదు** : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలనే రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంకన్న కోరారు. ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడం వల్లనే కార్మికుల ఆవేదనను అర్థం చేసుకుని సమ్మెదిశగా వెళ్లాల్సి వస్తోందని అన్నారు. ఒక వేళ ఏదైనా పరిస్థితుల వల్ల ఆర్టీసీ సమ్మె జరిగితే దానికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని తెలిపారు. తమ డిమాండ్లకు పరిష్కారం లభించేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సామరస్యంగా డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

**విడుదల చేయాలి** : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్?తో జేఏసీ నేతలు మార్చి 13వ తేదీనే సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి సమ్మె నోటీసు అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలని యూనియన్? నాయకులు డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.350 కోట్లలో ఎలాంటి కోతలు, షరతులు లేకుండా సక్రమంగా విడుదల చేయాలని వారు గతంలో సమ్మె నోటీసు ఇచ్చిన సందర్భంగా పేర్కొన్నారు.

## మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**టీ మీడియా, ఏప్రిల్ 13,ఢిల్లీ బ్యూరో :**



మహిళా రిజర్వేషన్ల చట్టం గురించి చర్చించేందుకు ఏప్రిల్ 15న తమ పార్టీ ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ బిల్లుపై సంబంధిత వర్గాలన్నింటితోనూ సమగ్ర సంప్రదింపులు జరపడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థాయిలో దీని ప్రభావం విస్తృతంగా ఉన్నందున, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని వెల్లడించారు. కర్ణాటకలోని బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

**మోదీ సర్కార్‌పై సోనియా ఫైర్**

అలాగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు, మహిళా రిజర్వేషన్ల చట్టం తదితర అంశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ సైతం మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టం కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. అలాగే ఈ ప్రక్రియను రాజ్యాంగంపైన చేస్తున్న దాడిగా పేర్కొన్నారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కులగణనను మరింత ఆలస్యం చేసి, దాన్ని పట్టాలు తప్పించడమే ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ అసలు ఉద్దేశమని ఆరోపించారు.

**ఆ హక్కులను పది కోట్ల మంది కోల్పోయారు : సోనియా గాంధీ**

నారీ శక్తి వందన్ అధినియం- 2023 చట్టం 73, 74వ రాజ్యాంగ సవరణ బిల్లుల విజయాల పునాదిపైనే రూపుదిద్దుకుందని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఆ సవరణ బిల్లులు ఆమోదం పొందిన తర్వాతే పంచాయతీలు, నగరపాలక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కల ప్రక్రియ వాస్తవానికి 2021లోనే జరగాల్సి ఉందని, కానీ మోదీ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వచ్చిందని మండిపడ్డారు. దీని పర్యవసానంగా ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనకు ప్రాతిపదికగా నిలిచే జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద లభించే చట్టపరమైన హక్కులను 10 కోట్లకు పైగా ప్రజలు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు.

**కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ**

మరోవైపు, నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి తమ పార్టీ లోక్‌సభ ఎంపీలందరూ తప్పక హాజరుకావాలని కాంగ్రెస్ సోమవారం విప్ జారీ చేసింది. ఏప్రిల్ 16–18 వరకు సభలో అత్యంత కీలకమైన కొన్ని అంశాలపై చర్చ, ఓటింగ్ జరగనున్నాయని తమ పార్టీ ఎంపీలకు సూచించింది. ఆ మూడు రోజులు ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడేంత వరకు తప్పనిసరిగా సభలో ఉండాలని కోరింది. పార్టీ వైఖరికి మద్దతు తెలపాలని కోరుతూ విప్‌ను జారీ చేసింది.

## ఇంటర్ ఫలితాల్లో రిషి విద్యార్థుల ర్యాంకుల పంట

- ఎంపీసీ, బైపిసీలలో రికార్డు ఫలితాలు

**టీ మీడియా, ఏప్రిల్ 13, మహబూబ్ నగర్ :**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తమకు మరెవరు సాటి లేని విదంగా చరిత్ర సృష్టించారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో రికార్డు స్థాయి ఫలితాలను రిషి కళాశాల సొంతం చేసుకుంది .

**ప్రథమ సంవత్సరం ఫలితాలు:**

ఎంపీసీ విభాగంలో యు. వినయ్ కుమార్ గౌడ్ 468/470 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. వేణుమాధవ్ రెడ్డి,జి. అంకిత్, జి. మాధురి, ఎ. కార్తీక్ రెడ్డి, సృజన విద్యార్థులు 467 మార్కులతో ప్రతిభ చాటారు.బైపీసీ విభాగం: కె. అక్షిత, తానియా మహమూద్ 438/440 మార్కులతో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. శ్రావణి, భవిత, సౌమ్య, సురేంద్ర చక్రవర్తి, అక్షిత, ఆయేషా జువా, అఖిల ,అశ్లేష యాదవ్, మౌనిక, రిషిత, నాగ సాయి వైష్ణవి, మైవిన్, కె. మీనాక్షి సహా 14 మంది విద్యార్థులు 437 టాప్ మార్కులు సాధించారు.

ద్వితీయ సంవత్సరం ఫలితాలు:

**ఎంపీసీ విభాగం:**




ఎం. భావన 995/1000 మార్కులతో రికార్డు స్థాయి ఫలితం సాధించారు. మొహమ్మద్ అశ్వాక్ అహ్మద్, సయ్యద్ మిస్బావుద్దిన్, శ్రీవిద్య 992 మార్కులు సాధించగా, కోటేశ్వర్ 990 మార్కులు సాధించారు.బైపీసీ విభాగంలో అఫ్సా మోయిన్, పి. గాయత్రి , అమూల్య ఈ ముగ్గురు విద్యార్థులు 994/1000 మార్కులతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు. ఫారియా, ఫాతిమా కదీర్ 993 మార్కులు సాధించగా, నందిని రెడ్డి, వైశాలి 992 మార్కులు, శ్రీనిధి 991, సృజన 990, సుమేరా బేగం 990 మార్కులతో ప్రభంజనం సృష్టించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్‌పర్సన్ శ్రీమతి చంద్రకళ వెంకట్ గారు, డైరెక్టర్ శ్రీ వెంకటయ్య గారు, డీన్ భూపాల్ రెడ్డి గారు, అకాడమిక్ డీన్ కళ్యాణ్ బాబు గారు, ప్రిన్సిపాల్స్ రాఘవేంద్రరావు గారు, వెంకటరత్నం గారు, ప్రసన్నకుమారి గారు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ, తమ విద్యాసంస్థలో కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఉత్తమ విద్య అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.